# ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- విద్యావ్యవస్థకు పెద్దపీట వేసిన కేసీఆర్ సర్కార్
- ప్రభుత్వ బడులను అభివృద్ధి చేశాం
- నీట్, ఐఐటీ కోచింగ్ ఏర్పాటుకు చర్యలు
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- బాలికల ఉన్నత పాఠశాలలో కృతజ్ఞత సభ

గద్వాల, డిసెంబర్ 13 : తెలంగాణ ప్రభుత్వంలో విద్యావ్యవస్థకు కేసీఆర్ సర్కార్ పెద్దపీట వేసిందని, సమాజ మార్పు విద్యార్థులతో వస్తుందని, ప్రతి విద్యార్థినీ ఉన్నత లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు సరైన స్థలం లేక విద్యార్థినులు అవస్థలు పడుతుండడంతో గ్రహించిన ఎమ్మెల్యే పాఠశాలకు అదనంగా స్థలం కేటాయించడంతో బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు కృతజ్ఞత సభను ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలోని గట్టు మండలం దేశంలోనే వెనుకబడి పోయిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను విడుతల వారీగా అభివృద్ధి చేశానని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలతోపాటు గురుకులాలు, కస్తూర్బాపాఠశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించినట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వబాలికోన్నత పాఠశాలకు ప్రత్యేకత ఉందని, విద్యలో మంచి గుర్తింపు పొందిందన్నారు. పాఠశాలలో చాలామంది గ్రామీణ విద్యార్థినులు చదువుకోవడంతో వారు కూర్చోవడానికి స్థల సమస్య ఉండడంతో ప్రధానోపాధ్యాయుడు సమస్యను తన దృష్టికి తీసుకరావడంతో పాఠశాల పక్కనే ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలాన్ని కలెక్టర్ సహకారంతో పాఠశాలకు కేటాయించినట్లు తెలిపారు. త్వరలో ఈ స్థలంలో నూతన తరగతి గదులు అన్ని సౌకర్యాలతో నిర్మించి అందుబాటులోకి తెస్తామన్నారు. విద్యార్థినుల కోసం పాఠశాలలో త్వరలో నీట్, ఐఐటీకి సంబంధించిన కోచింగ్ ఏర్పాటు చేసే విధం గా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. విద్యార్థినులు శ్రద్ధగా చదువుకొని పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాలలో ఏ స మస్య ఉన్నా తన దృష్టికి తీసుకరావాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యాక్రమాలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థినులతో సెల్ఫీ, ఉపాధ్యాయులతో గ్రూప్ ఫొటో దిగారు.

### కులాంతర వివాహలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కేసీఆర్ ప్రభుత్వం కులాంతర వివాహలకు ప్రోత్సాహం అందించిందని, కులాంతర వివాహలు చేసుకున్న జంటలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కులాంతర వివాహలు చేసుకున్న మూడు జంటలకు ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రోత్సాహాన్ని బుధవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కులాంతర వివాహలు చేసుకున్న జంటలకు వారి కుటుంబాల నుంచి ప్రోత్సాహం ఉండకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారు ఏదో ఒక వ్యాపారం చేసుకొని ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సాయాన్ని జంటలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతమై అందరికీ ఆదర్శంగా నిలవాలని సూచించా రు. ప్రోత్సాహాన్ని అందుకున్న వారిలో మల్దకల్ మండల పరిధిలోని అమరవాయి గ్రామానికి చెందిన సమ్రీన్, గద్వాల పట్టణానికి చెందిన పుష్పలత, భర్త శివకుమార్, దీపిక ఆమె భర్త చంద్రయ్యకు ఒక్కొక్కరికీ రూ.2.50లక్షల విలువ గల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఎంపీపీ విజయ్‌కుమార్, డీఈవో సిరాజుద్దీన్, కౌన్సిలర్ శ్రీరాములు, నాయకులు గో విందు, ధర్మనాయుడు, వెంకటన్నగౌ డ్, కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రా జానందం, ఉపాధ్యాయుడు జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కులాంతర వివాహం చేసుకున్న జంటకు
చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సాంస్కృతిక ప్రదన్శలు నిర్వహిస్తున్న విద్యార్థినులు



హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న
బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

## జోగుళాంబను దర్శించుకున్న అలంపూర్ ఎమ్మెల్యే



జోగుళాంబ ఆలయంలో ధ్వజ స్తంభానికి మొక్కుతున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్,డిసెంబర్ 13 : అలంపూర్ క్షేత్రంలోని జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు వారికి ఆలయాధికారులు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కొనుగోలు చేసిన నూతన వాహనానికి జోగుళాంబ సన్నిధిలో పూజలు చేయించారు. ఆయన వెంట చల్లా అగస్త్యరెడ్డి, ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యనాయుడు, ఈవో పురేందర్‌కుమార్, ధర్మకర్తలు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

### కబడ్డీ పోటీలు ప్రారంభం

వడ్డేపల్లి, డిసెంబర్ 13 : మండలంలోని తిమ్మాజిపల్లె గ్రామంలో కార్తీక దామోదరుని మహోత్సవం సందర్భంగా ఓపెన్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలకు 36 టీంలు రాగా పోటీలను ఎమ్మెల్యే విజేయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలో ఐక్యత ఉండాలని పోటీలను ఆహ్లాదకరంగా నిర్వహించాలని సూచించారు. యువకులతో కాసేపు కబడ్డీ ఆడి వారిని ఉత్సాహపరిచారు. అనంతరం బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. అనంతరం శివాలయాల్లో పూజలో ఎమ్మెల్యే పాల్గొన్నాడు.

## బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్య పడొద్దు

- మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

కోయిలకొండ డిసెంబర్ 13 : బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని అందరికీ అందుబాటులో ఉండి ఆదుకుంటానని మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి భరోసా కల్పించారు. మండలంలోని శేరివెంకటాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆంజనేయస్వామి జల్ది ఉత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజా నిర్ణయాన్ని గౌరవిస్తామని, నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. వచ్చే పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన కార్తీక మాసం ముగింపు ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంజన్న ఉత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నివాసంలో అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, నారాయణపేట ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాజా, వైస్ ఎంపీపీ కృష్ణయ్యయాదవ్, నాయకులు రవి, గిరిధారి నాగయ్య, భీంరెడ్డి, నారాయణరెడ్డి, ఆంజనేయులు, గోపాల్, రవికిరణ్‌రెడ్డి, రాజ్‌కుమార్, అంకిళ్ల రవి, సతీశ్, బచ్చిరెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శేరివెంకటాపూర్ అంజన్న పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

# జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

- 592 క్యూసెక్కులు రాక
- అవుట్‌ఫ్లో 1935 క్యూసెక్కులు



ఆర్డీఎస్ ప్రధాన కాల్వలో పారుతున్న నీరు

ధరూర్, డిసెంబర్ 13 : జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పూర్తి తగ్గిపోతున్నది. బుధవారం 592 క్యా సెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడా, 1935 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 750 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 392 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 325 క్యూసెక్కులు, కుడి కాల్వకు 401 క్యూసెక్కులు, ఆర్డీఎస్ కెనాల్‌కు 300క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ నీటిమట్టం 7.971టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.264 టీఎంసీల నీటిమట్టం ప్రాజెక్ట్‌లో నిల్వ ఉన్నది.

### ఆర్డీఎస్ ఆనకట్టకు స్వల్పంగా ఇన్ ఫ్లో

అయిజ, డిసెంబర్ 13 : కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. బుధవారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 239 క్యూసెక్కులు చేరుతుండగా, ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 412 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 7.8 అడుగుల మేర నీటిమట్టం ఉన్న ట్లు ఆర్డీఎస్ ఏఈ రాందాస్ తెలిపారు. తుమ్మిళ్ల పథకం పంప్ ద్వారా నీటి వి డుదల కొనసాగుతుందన్నారు.

### 11 టీఎంసీలకు చేరిన టీబీ డ్యాం

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంలో నీటి మట్టం 11 టీఎంసీలకు చేరుకున్నది. బుధవారం ఇన్‌ఫ్లో 490 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 1,786 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 11.939 టీ ఎంసీల నీటి నిల్వ ఉంది. 1,633అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గానూ, ప్రస్తుతం 1,591.06 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.